# డెత్ వారెంట్!

మహిషం మీద ఎక్కి ఆకాశవీధుల్లో చక్కర్లు కొడుతున్న యమధర్మరాజు నలుదిక్కులా వీక్షిస్తున్నవాడై... భూలోకవాసి అయిన సేనాపతి 'యమా... యయా...' అనుచూ తన నామమునే స్మరించుట ఆలకించినవాడై ఆశ్చర్యపోయెను.

బాధ కలిగితే అమ్మా అనో....! రామా... కృష్ణా.... నారాయణా అనో తల్లినిగాని దేవుడ్ని గానీ తల్చుకుంటారు.

అందుకు భిన్నంగ త్వరలో మృత్యువాత పడనున్న సేనాపతి ఇంకనూ తననామమునే జపించుట... తననే స్మరించుట చూచి కడుముదమంది భూలోకమున కేతెంచె!

చావుబ్రతుకులమధ్య నరకయాతన అనుభవిస్తున్న సేనాపతి కళ్ళఎదుట ప్రత్యక్షమైన యముని చూచి "నేను మరణించిన తరువాతనే కదా నీవు రావలసినది... భటులు మీలోకమునకు తీసుకుపోవలసినదీను! మరణశయ్యపై నున్న నన్ను చూడనీవేల వచ్చితివి?..." అని సేనాపతి పలికెను.

"నీవన్నది సత్యమే! నీవు దేశానికీ సర్వసైన్యాధ్యక్షుడవని ఎరుంగుదును. ఎన్నో మారులు ఇతర దేశములపై దండెత్తి విజయము పలుమార్లు కైవశము చేసుకొంటివి. అటువంటి నిన్ను చివరిక్షణములో పలుకరించి పరామర్శించ వచ్చితిని..." యమధర్మరాజు బదులిచ్చెను.

"ఎందులకో నాలో ప్రశాంతత లోపించినది. అతిధైర్యవంతుడినైన నేను క్షణక్షణానికీ మానసికముగా నీరసించి పోవుచున్నాను. నాలో ఇప్పుడు స్థిరచిత్తములేదు. మనస్సుకి శాంతి కరువైనది..." గోడు చెప్పుకున్నాడు సేనాపతి.

"నీవు మిక్కిలి ధైర్యశాలివని... పరాక్రమవంతుడివని ఎరుంగుదును. అయిననూ జీవిత చరమదశలో ప్రతిఒక్కరూ మృత్యుభీతితో తల్లడిల్లుట సహజము. ప్రశాంత మనస్కుడవై దైవమును ధ్యానించుము సేనాపతీ...!" ధైర్యము చెప్పెను.

"సమవర్తీ! నా ఎదుట నిలబడి ఎందుకు కాపలా కాయుట? నా చావేదో నేను చస్తాను. నన్ను చంపక ఇటనుండి నిష్క్రమించుము..." సేనాపతి మాటల్లో విసుగు ధ్వనించింది.

"ఎందులకా విసుగు? అవసానదశలోనైననూ ఆవేశకావేశములు విసర్జించి... ప్రశాంత చిత్తముతో వుండవలె..." మరో మంచి ఉచిత సలహా ఇచ్చాడు యముడు.

"నేను బుద్ధిశాలిని. నాకా మాత్రము తెలియదా? జీవితమంతయూ మిక్కిలి శ్రద్ధాసక్తులతో పరదైవమును స్మరించక నిన్నే ఎల్లవేళలా స్మరించితిని. నీనామమునే జపించితిని. అయిననూ నామీద నీకు దయలేదు. నీభక్తుడనైన నన్నునై మీలోకమునకు గైకొనపోవుచూచుచుంటివి.

ఇదేమి అన్యాయము..."

"భక్తితో నన్ను నీవు పూజించితివా? మరణము సంభవించబోవు సమయముననూ అబద్ధములు ఏల ఆడుచుంటివి సేనాపతీ? బ్రతుకుపట్ల భయముతో మరణించెదనన్న భీతితో నన్ను ఆశ్రయించి పూజించితివి."

"భయమా? నాకేల భయము? నేను సర్వసైన్యాధ్యక్షుడను. మరణమన్న భయము కాదు. నన్ను గాంచి భయము ఆమడదూరము పరుగెత్తవలె యమధర్మరాజా..." తన గొప్ప మరోసారి ప్రకటించుకున్నాడు సేనాపతి.

"అది... నీ కర్తవ్య నిర్వహణలోనే కానీ... నిజ జీవితములో కాదు. నీవు వట్టి పిరికిపందవు. అందులకే మృత్యువును చూచి భయముతో వణుకుచున్నావు. నామాట విని ప్రశాంత మనస్కుడవై అంతిమ ఘడియ వరకు ధైర్యముగ నుండుము...!"

"యమధర్మరాజా! నీ మొండివితండవాదము వినుచున్న... నన్ను నీవెంట మీలోకముకు తీసుకువెళ్ళవలెననే దృఢ నిశ్చయముతో వచ్చితివని తెలియుచున్నది. సరే! అటులయిన... భూలోకమునందు ఆచరణలో గల పద్ధతి ననుసరించి ఒక వ్యక్తిని జైలులో పెట్టవలసివచ్చిన 'అరెస్ట్ వారెంట్'తో పోలీసులు వత్తురు. సోదా చేయవలెనన్న 'సెర్చి' వారెంట్‌తో వచ్చుట రూలు! కావున... నన్ను తీసుకొనిపోవలెనన్న నీవు 'డెత్‌వారెంట్'తో వచ్చితివా చెప్పుము. లేనిచో నన్ను తీసుకుపోవుట అత్యంత కష్టసాధ్యము... దుర్లభము..." అడ్డం తిరిగేడు సేనాపతి.

"పిచ్చిమానవా!... ఏమి నీవాచాలత? మృత్యువాతపడిన వారిని యమలోకమునకు కొనిపోవు నాకు ఏ జి.వో. అక్కర్లేదు. నేను నిరంకుశుడను. ఇది నా విధి నిర్వహణ! ఇందులకు ఆదేవదేవుడు కూడా ఏమీ చేయలేడు. భూలోకమున మీకు మీ యిచ్చ వచ్చినటుల స్వార్థ చింతనతో 'జి.వో.'లు జారీ చేయుదురేమోగానీ... నా విషయములో నారాయణుడిచ్చిన 'బ్లాంకెట్' ఆర్డరు చాలు! అదియే శాసనము" యముడు పరిహాస ధోరణితో నవ్వెను.

"మీ శాసనములు... బ్లాంకెట్ ఆర్డర్లు మీ లోకమునకు మాత్రమే పరిమితము. భూలోకమున అవి చెల్లనేరవు. వారెంట్‌లేకనే నన్ను తోడ్కొని పోవుటకు మా చట్టము కోర్టు అంగీకరించవు. అందుచేత వెనక్కు మరలుము. వెడలిపొమ్ము..." బల్లగుద్దినట్లు సేనాపతి మాట్లాడేడు.

"ఔరా! ఏమి నీ తెంపరితనము? నన్నే ధిక్కరించుచుంటివా?..." ఎన్టీరంగారావు, కైకాల సత్యనారాయణను కోటశ్రీనివాసరావులను ఇమిటేట్ చేయకనే తనదైన స్వంతశైలిలో కాస్త కోపాన్ని మరికొంచెం ఆవేశాన్ని మిళాయించి హూంకరించెను.

"నీ హూంకరింపులు... గాండ్రింపులు... సకిలింపులు... ఇకిలింపులు కట్టిపెట్టి వచ్చిన దారిన వెళ్ళుము. డెత్‌వారెంట్ నీ పరిధిలో లేకున్న వైకుంఠమున కేగి శ్రీహరిని కల్సి నీ

కష్టమును విన్నవించుకుని వారెంట్ పొంది నావద్దకు రమ్ము..." నిష్కర్షగ మాట్లాడెను సేనాపతి.

"ఓయీ మానవా! నీకు మతిభ్రమించినది. అవాకులు చెవాకులు పేలుచూ అధర్మముగ అసంబద్ధముగ మాట్లాడుచుంటివి! నేనెవరననుకొంటివి! నాపేరు వినిన సర్వ మానవాళి భయభ్రాంతులగుదురు. గుండె ఆగి చచ్చెదరు. అంతటి పవర్‌ఫుల్ పోస్ట్‌లో వున్న నాకే ఎదురుచెప్పుచుంటివా? నా ఆనతి ధిక్కరించుటకు నీవెంత?..." అసహనంతో కోపంతో యముడు రుసరుసలాడేడు.

"చూడు యమా! నామాటలు పెడచెవిన పెట్టిన నీకు కష్టములు తప్పవు. ఈలోకము సంగతి నీకు తెలీదు".

"కష్టములా...? నాకా?... వెర్రివాడా...!" వికటాట్టహాసము చేసెను.

"బి.సి. నాటి డైలాగులు వల్లించద్దు యమా! నా కళ్ళ ఎదుటనుంచి అదృశ్యము కాకున్న... మాలోకమున గల సర్వోత్తమన్యాయస్థానమును ఆశ్రయించి చట్టవ్యతిరేకముగ నీవు వ్యవహరించుచుంటివని 'రిట్' ఫైల్ చేయుదును. నీ చర్యపై 'స్టే' ఆర్డరు తెచ్చెదను. అప్పుడైననూ నీవు వట్టి చేతులతో వెనుదిరిగిపోక తప్పదు. అది తథ్యము".

"నీకోర్టు ఇచ్చు 'స్టే' లెక్కచేయను. నిన్ను తీసుకొనిపోవుటయే నా డ్యూటీ!" తెగేసి చెప్పాడు యముడు.

"అటులయిన కోర్టు ధిక్కార నేరము కింద నీపై కేసు బనాయించి మా రక్షకసిబ్బంది నీ చేతులకి బేడీలు వేసి లాక్కెళ్ళి జైల్లో పెట్టెదరు...!"

అంతట యముడు పరిహాసముతో "విషయము అంతవరకు వచ్చిన నేను లాయర్‌ని సంప్రతించి జామీను మీద విడుదలగుదును. అదీ కానిచో ఎవ్వరికీ చిక్కక అదృశ్యమగుదును... తెల్సినదా నా పవర్?..." యముడు మీసము మెలేసెను.

"వెళ్ళవయ్యా యమా! మాయమైపో! అదే కదా నాకునూ కావలసింది. ఆలస్యము చేసినచో 'నాన్ బెయిలబుల్ వారెంట్'తో అధికారులు రంగప్రవేశము చేసి నిన్ను బొక్కలో... అదే!... కటకటాల వెనక్కు తోయుదురు..."

"అకటకటా?! కటకటాలనిన నాకు మిక్కిలి భీతి! నీ బుద్ధి కుశలతకు సంతసించి ప్రస్తుతానికి వెడలుచుంటిని? తిరిగి డెత్‌వారెంట్‌తో నీవు కోరిన విధముగ వచ్చి నిన్ను నా వెంట మాలోకమునకు కొనిపోయెదను" జానపద సినిమాలో మాంత్రికునిలా ఠక్కున యమధర్మరాజు మాయమాయెను.

★★★★★

ఎలక్షన్ కమీషన్ ఎన్నికల నోటిఫికేసన్ జారీ చేయటంతో దేవలోకమంతా కోలాహలంగా

వుంది.

శ్రీమన్నారాయణుడు భార్యాసమేతంగా కొన్ని యుగాలనుండి వైకుంఠమునందు తిష్ఠ వేసుకుని కూర్చున్నందుకు... ఆ పదవి మరొకరికి దక్కనందుకు... దేవతలందరూ గుర్రు మీదున్నారు. అక్కడ కూడా ప్రజాస్వామ్యం (సారీ! దేవతల స్వామ్యం) పరిఢవిల్లాలని భూలోకంలోవలెనే అయిదేళ్ళకోమారు ఎన్నికలు జరుపుకోవాలని దేవతలంతా ఏకమై ఒక రిజల్యూషన్ పాస్ చేసుకున్నారు.

ప్రప్రథమంగా దేవలోకంలో జనరల్ ఎలక్షన్స్ తంతు జరగబోతున్నందున ఎవరికి వారు గ్రూపులుగా ఏర్పడి రాబోయే ఎన్నికల్లో ఎవరెవరు ఏఏ పదవికి పోటీ చేయాలోని తీవ్రంగా చర్చించుకోసాగేరు.

అభ్యర్థులకు పార్టీ టికెట్టు ఇవ్వటం... వారిని ఎలక్షన్లో నిలబెట్టటం గురించి దేవతలంతా తలమునకలవుతున్నారు.

త్రిమూర్తులైనటువంటి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రత్యేకంగా సమావేశమై తీవ్రస్థాయిలో చర్చించుకొనుచుండిరి.

"వైకుంఠవాసా! ఈ మారు మీ పదవిని నేను అలంకరించవలెనని ముచ్చటపడుచుంటిని. పైగా నేను త్రినేత్రుడను. మనవి శరీరాకృతులు వేరైనా ఇద్దరిదీ అంశ ఒక్కటే! 'శివాయ విష్ణు రూపాయ- విష్ణు రూపాయ శివయే నమః' అంటారు కదా?! అందుచేత మీవద్ద గల మహిమనంతా నాకు ధారాదత్తం చేసి వైకుంఠానికి నన్ను ఈసారికి అధిపతిని చేయండి...!" చిరకాలముగ తన మనసులో గల అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు శివుడు.

ఆ మాట విన్న బ్రహ్మదేవుని భృకుటి ముడిపడి... వాని నాలుగు తలలూ చిరుకోపంతో వూగిపోయినయ్.

"మహేశ్వరునికి అంతటి పేరాశ పనికిరాదు. మీరు భోళా శంకరులు! వైకుంఠానికి తమరు ఆధిపత్యం వహిస్తే... కోరినవారికల్లా వరములొసగి ముల్లోకాలలో అల్లకల్లోలం సృష్టిస్తారు. అందుచేత మీకీ పదవి తగదు. నావంటి వాడే ఈ పదవికి అర్హుడు! యోగ్యుడు!! నాలుగు తలలున్నవాడిని కావున అన్ని లోకాలను ఏకకాలంలో వీక్షించగలను. బేధభావంలేక సమదృష్టితో అందరినీ పరిరక్షిస్తూండగలను! ఏమనెదవు శ్రీహరీ...!" కొంచెం కటువుగ మరి కొంచెం ఘాటుగా తన మనసులోని అభిప్రాయాన్ని వ్యక్తం చేసేడు బ్రహ్మ.

"చూడండీ! మనం దేవతలం! మానవులవలె తగవులాడుకొనరాదు..." ఇద్దరినీ శాంతింపచేయాలని మాట్లాడేడు శ్రీమన్నారాయణుడు.

"అటుపైన... సృష్టికిమూలమైన బ్రహ్మగారి పదవినైనా నాకు కట్టపెట్టండి! ఓటింగ్ ప్రక్రియ లేకుండానే మన్లో మనం ఏదోవిధంగా రాజీ కుదుర్చుకుని బైటవారికి అవకాశం లేకుండా

చేయుటే మనవిధి...!" దీనాతిదీనంగా ముఖంపెట్టి శ్రీమన్నారాయణుడిని వేడుకున్నాడు శివుడు.

"అంటే... వంటినిండా చితాభస్మం పూసుకుని... ఏనుగు చర్మం ధరించి... త్రిశూలం చేతబూని స్మశానవాటికలందు విహరించుట నావల్లకానిపని. నాలుగు తలలుండటంతో కైలాసాన శివతాండవం చేయటమూ అసాధ్యమే! ఎల్లవేళలా సరస్వతి వీణావాదన వింటూ ప్రశాంతచిత్తంతో మురిసే నేను కైలాసానికి అధిపతిని కాలేను..." కారణాలు చెప్పితన అయిష్టతను వ్యక్తం చేసాడు బ్రహ్మ.

ఇరువురి మనోభీష్టాలనూ విన్న శ్రీహరి ధర్మ సంకటంలో పడ్డాడు. ప్రశ్నార్థకంగా లక్ష్మీదేవి ముఖంలోకి చూసాడు సమస్యకి పరిష్కారమేదైనా సెలవిస్తుందేమోనని.

అంతరకు పాదాలచెంత వున్న శ్రీమహాలక్ష్మి స్వామి తలపరకూ జరిగి "నాథా! వైకుంఠవాసానికి అలవాటుపడ్డ నేను మీస్థాన చలనానికి అంగీకరించను..." అంటూ భర్త చెవిలో రహస్యంగా ఊదింది.

శ్రీహరి చిద్విలాసంగా నవ్వినవాడై "దేవీ! అటులైన దేవేంద్రుని పదవికి ఎసరుపెట్టుట అనివార్యమన్పింస్తోంది..." అన్నాడు.

"అది ఏల?" లక్ష్మీదేవి ప్రశ్నించింది.

"ఇన్ని యుగాలూ నీవు నా పాదాలచెంత భర్తకు సేవలు మాత్రమే చేయుచుంటివి. నేను ఇంద్రలోకాధిపతినైనచో రంభ, ఊర్వశి, మేనకల నృత్యములు కన్నులారా చూచి ఆనందించగల అవకాశముండును కదా! అదియును గాక... గానము నృత్యము నీవు వారివద్ద అభ్యసించ వీలగును కదా?! ఇన్నేళ్ళుగా ఇక్కడే 'వంటికొమ్ము-శొంఠికాయ' వలె వున్న నీకు అక్కడ సరైన కాలక్షేపము వుండగలదు... ఏమనెదవు?..."

లక్ష్మీదేవి తన నిర్ణయాన్ని చెప్పేలోపే బ్రహ్మ కలుగజేసుకుని "అవును శ్రీహరీ! వైకుంఠాన్ని వదిలితే తర్వాత ఇంద్రపదవియే తమకి తగినది. మీరటు వెళ్ళిన నేనూ ఉమాపతి ఇద్దరమూ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌కొచ్చి వైకుంఠాధిపతి మాలో ఎవరో మేము తేల్చుకుంటాం!" ఒక్కనోటితో మాట్లాడినా బ్రహ్మ నాలుగు తలలూ భళ్ళున నవ్వేయి.

నాలుగు తలలవాని నవ్వుతో వైకుంఠం దద్దరిల్లింది.

శ్రీహరి అవాక్కయ్యాడు. ఉమాపతి విస్తుపోయాడు. సీనులోకి టైమ్‌కి ప్రవేశించిన నారదుడు చిరతలు వాయిస్తూ చిందు వేసాడు. అందరి ముఖాలనీ పరీక్షగా వీక్షించి 'నారాయణుడెక్కడుంటే ఈ నారదుడు అక్కడే వుంటాడు. అది వైకుంఠంగాని... కైలాసంగానీ... ఇంద్రలోకంగానీ..." చమత్కారంగా మాట్లాడేడు.

సరిగ్గా అదే సమయానికి యమధర్మరాజు అచటికి రావటం అందరినీ ఆశ్చర్యచకితులను

చేసింది.

"ఖర్మకాలి... ఈయనగారు కూడా వైకుంఠంలో తిష్టవేసి పదవిని తస్కరించాలని రాలేదు కదా..." అని అక్కడున్న వారంతా అయోమయంలో పడ్డారు.

వచ్చీరాగానే త్రిమూర్తులకు ప్రణమిల్లాడు యమధర్మరాజు.

"ఏమిటి చిరంజీవీ ఇటుల వేంచేసితివి?..." పలుకరించాడు శ్రీహరి.

"ఏమని చెప్పుదును? నేనొక ధర్మసంకటస్థితిని ఎదుర్కొనవలసి వచ్చినది స్వామీ! నా కర్తవ్య నిర్వహణకు ఒక భూలోకవాసి అడ్డు వచ్చి నన్ను పలువిధముల తికమక పెట్టుటయేకాక నా పదవికే తలవంపులు తెచ్చినాడు. నన్ను తమవద్దకు వెడలి... చనిపోయాక అతడ్ని యమలోకమునకు తోడ్కొని పోవుటకు 'డెత్ వారెంట్'తో రమ్మని... లేకున్న నన్ను భూలోకమునందు జైలులో పెట్టించి కోర్టు కీడ్చెదనని బెదిరించినాడు. మరో మార్గం కానరాక మీ శరణుజొచ్చితిని...!" క్లాసులో టీచరుముందు స్టూడెంట్ లేచి నిలబడి కంఠస్తం పట్టిన పాఠాన్ని గడగడా అప్పగించినట్లు యమధర్మరాజు మాట్లాడెను.

"సమవర్తీ! నీ సమస్య నాకు అర్థమైనది. కానీ దాని పరిష్కారమునకు ఇది సరైన సమయము కాదు. ప్రస్తుతము మేమందరూ దేవలోకములో రానున్న ఎన్నికల హడావుడిలో వున్నాము..." పరిస్థితి శ్రీహరి క్లుప్తంగా చెప్పాడు.

"అవునవును! వీరిలో ఎవరు ఏ పదవిలో వుందురో... ఎవరికి స్థానచలనము కలుగునో... ఎవరు ఎన్నికలలో ఓడెదరో కొద్దిరోజులుండిన కాని తెలియదు. అంతవరకూ ఫైళ్ళమీద సంతకము చేయు అధికారము శ్రీహరికే కాదు మాలో ఎవ్వరికీ లేదు. జీ.వో.లు జారీ చేయుట కుదరదు. ఎన్నికల నియమావళిని అతిక్రమించుటయే అగును..." బ్రహ్మదేవుడు జోక్యం చేసుకున్నవాడై సమవర్తికి పరిస్థితి వివరించెను.

"అందుచేత ఎన్నికలు ముగిసి వైకుంఠానికి అధిపతి ఎవరైనదీ తెలిసేవరకూ నీవు కోరిన 'డెత్‌వారెంట్' సమస్యని పక్కనబెట్టుట శ్రేయోదాయకము..." శ్రీహరి ఫైనల్ రిప్లై ఇచ్చాడు.

శ్రీహరి మాటలు విన్న యముడు కించిత్ చింతాక్రాంతుడై వైకుంఠమునుండి నిష్క్రమించి తన యమపురికరిగెను.

యమధర్మరాజు డెత్‌వారెంట్‌తో వచ్చేవరకూ తనకు ఆయుష్షు పెరిగినందుకు సేనాపతి సంబరపడ్డాడు!!

- సమాప్తం -